
కథ

# ప్రేమా...పిచ్చీ... ఒకటే!




డా॥ మంతెన సూర్యనారాయణరాజు

"అయ్‌వావోయ్! అమ్మవావోయ్! అయ్యావావోయ్!" అంటూ గుక్క పట్టి ఏడుస్తున్నాడు మురుగభూషణం.

భూషణం కుటుంబసభ్యులంతా ఒక్కొక్కళ్లే, చేస్తున్న పనులు మాని అతని చుట్టూ మూగుతున్నారు.

దేవుడి గదిలో దీపం వత్తులు తయారుచేస్తున్న వాళ్ల పెద్ద దిక్కైన ముత్తవ్వకి అతగాడి ఏడుపు లీలగా వినిపించింది. ఎనభై ఏడేళ్ల ఆమె నడుం వంగి నడవలేక నడవలేక కర్ర సాయంతో మురుగభూషణం దగ్గరికి వచ్చింది. ఆమె పేరు నాంచారు. కళ్లకు చెయ్యి అడ్డం పెట్టుకుని, "నీ ముఖం ఈడ్వా! ఏం కొంప మునిగిందని ఏడుస్తున్నావు?" అని గట్టిగానే అడిగింది. తీస్తున్న ఆరున్నొక్క రాగాన్ని విషయం చెప్పకుండా, మరింత పెంచాడు మురుగభూషణం.

మురుగభూషణం తండ్రి గరుడగమనరావు, చికాకుతో, "చెప్పన్నా ఏడు, లేదా ఏడ్చున్నా చెప్పు!" అంటూ కొడుక్కి రెండు అప్పన్లు ఇచ్చాడు. అబ్బే అలాక్కూడా విషయం బైటికి రాలేదు. కొడుకు నెత్తి మీద దిక్కుతోచక గరుడ గమనారావు ఒక్క జెల్లకాయ కొట్టాడు.

నందివర్ధని భర్తని చెట్టంత కొడుకుని కొట్టొద్దని సముదాయిస్తూ, "మీరా దూకుడు కాస్త ఆపండి! విషయం నేను వాణ్ణడిగి తెలుసుకుంటాగా!" అంది. భూషణాన్ని బుజ్జగిస్తున్నట్లుగా దగ్గర కూర్చుని, "కన్నా! ఎందుకేడుస్తున్నావు?" అని మృదువుగా అడిగింది.

తల్లి భుజానికేసి తన నెత్తి కొట్టుకుంటూ, "అమ్మా! ఘోరం జరిగిపోతూందే!" అంటూ దుఃఖం తాలూకు ముక్కులోంచి వచ్చిన చీమిడిని వేళ్లతో తీసి దూరంగా విసిరేశాడు. ఆ తడిని తల్లి చీర కొంగుకు తుడిచేశాడు.

కొడుకును ఏదో విధంగా సమాధానపరచాలనుకున్న నందివర్ధని, అసహ్యాన్ని కనపనివ్వకుండా, "వెధవా! ఆ చీమిడి తడి నా కొంగుకు తుడుస్తావే!" అని నెమ్మదిగా విసుక్కుంది.

మురుగభూషణం ఏడుపు తిరిగి తారస్థాయికి చేరింది.

ఇది పద్ధతి కాదనుకుని, వాళ్ల ముత్తవ్వ నాంచారి సీన్‌లోకి డైరెక్టుగా ఎంటరైపోతున్నట్లు, "ఇంత సేపూ ఆడదాన్లా అలా ఏడ్చి అఘోరించేబదులు, విషయం చెప్పు ముందు! కొంపదీసి ఏ కాలేజీ పిల్లైనా చెంప మీద చెప్పుతో గాని మళ్లీ కొట్టిందా?" అంది.

ముసలావిడ భూషణాన్ని అడిగినదాన్ని బట్టి, అంతా ముక్కు మీద వేలేసుకున్నారు. పైగా లోగడ మనవాడికిటువంటి సత్కారం జరిగినట్లు ఈ ముసలిదానికెలా తెలిసిందని వాళ్ల అనుమానం.

గరుడగమనారావు, తనకు కొంత అర్థమైనదన్నట్లు "బహుశా వీడేదో కాని పని చేసుండొచ్చు. దానికి పర్యవసానంగా తిరిగి అటువంటి సత్కారమే జరిగి వుంటుంది" అన్నాడు. పైగా మన నాంచారి ముత్తవ్వ మాట పట్టిపోదు. ఆమె ఆవులిస్తే పేగులు లెక్క పెట్టగలదంటూ కితాబిచ్చాడు.

వెంటనే నందివర్ధని "ఇంక మీరు నోటికి తాళం వేస్తారా? కన్నా, నిన్ను వాళ్లు అన్ని మాటలంటుంటే నోరు మెదపవే? తాత్సారం చెయ్యక నువ్వు విషయం చెప్పకుంటే, నా మీద ఒట్టు! " అంది.

ఇప్పుడైనా విషయం చెప్పకపోతే ముత్తవ్వ అన్న మాటే నిజమనేస్తారు వీళ్లు. "నా ఫేవరేట్ యాక్టర్ కత్రినాకైఫ్‌కి సల్మాన్‌ఖాన్‌తో పెళ్లి అయిపోతుందట. అయ్‌వావోయ్ ఎలాగే...?" అంటూ బేరమన్నాడు.

వెంటనే వాళ్ల సవతి అక్క రజని కలుగజేసుకుంటూ, "ఆమెకు పెళ్లవుతూంటే మధ్య నీకెందుకు? ఏవిటో కనుక్కుందురూ!" అని అడిగింది.

వర్ధని, "ఆ అమ్మాయిని మనవాడు ప్రేమించాడేమో! ఏవండీ, మీరన్నా ఆ అమ్మాయెవరో, ఏవిటో... కనుక్కుందురూ!" అని భర్తతో అమాయకంగా అంది.

రజని, "పిన్నీ! ఆమె ఎవరను కుంటున్నావు? బాలీవుడ్‌లో అప్సర లాంటి అందాలతార కత్రినాకైఫ్. ఎందరో మగాళ్లకి కలల రాకుమారి. ఈ మురికి భూషణంగాడికి ఆమెతో లవ్వా! పెళ్లా? వీడు ముఖమైనా సరిగ్గా కడగడు. ఒక డ్రెస్సు సెన్స్ లేదు. కనీసం చదువుకునే పుస్తకానికే సవ్యంగా అట్ట వెయ్యడం చాత కాదు. ఈ డర్టీ గూస్‌గాడిని ఆమె పెళ్లాడుతుందా? వింటే నవ్విపోతారు. ప్రస్తు

తం అమె కన్ను సల్మాన్‌ఖాన్ మీద ఉంది. ఎప్పటికైనా వాళ్ల పెయిర్ చూడముచ్చటేస్తుంది" అంది.

నాంచారి ఆబగా మనవరాలి దగ్గరకెళ్లి, "రజనీ! నా తెలివైన మనవరాలా! ఆ అమ్మాయి తల్లిదండ్రులు కట్నకానుకలు దండిగా ఇస్తారా?" అంటూ అడిగింది.

అమ్మ ముసలిదానా! నీకెంత ఆశే అని మనసులో అనుకుని, పైకి "ఇదిగో ముసలీ! ఆమె తల్లీ, తండ్రీ వేరే వేరే దేశాలకు మతాలకు చెందినవాళ్లు. నీ మనవణ్ని ఆమె పెళ్లాడుతుందని తెగ ఆశ పడిపోతున్నావు. ఈ మురగ భూషణంగాణ్ని, తన ముఖాన్ని ఒక్కసారి అద్దంలో చూసుకొమ్మను!" అంది రజని.

సన్నీ మాట పూర్తికాగానే, మరో ఫ్రెండ్ జాకీ కలుగజేసుకుంటూ, "ఉరేయ్ సన్నీ! ఆ కత్రినాకైఫ్ వీడికి అక్కకూతురా, లేక మేనమావ కూతురా? ఏముందని వీణ్ని ఆమె ప్రేమిస్తుంది, పెళ్లాడుతుంది? ఆ సల్మాన్ ఖాన్ పెద్ద రోమియో. కైఫ్, ఐశ్వర్యారాయ్ లాంటి ఆడాళ్లతో బోలెడన్ని ఎఫైర్లు నడిపాడు. వాడు బాలీవుడ్ హీరో, అందగాడు, ఫైటర్, బాడీ బిల్డర్. అతని నెవరైనా ప్రేమిస్తారు. వీడి పర్సనాలిటీ చూస్తే మునిస్పాలిటీయేగా! మన క్లాస్ మేట్ జాహ్నవికే వీడు నచ్చలేదంటే, కైఫ్ వీణ్ని ఏం చూసి ప్రేమిస్తుందో?" అన్నాడు, సిగరెట్ పీక ఆర్పి దూరంగా విసిరేస్తూ.

సవతి కూతురి మాటల్ని బట్టి గరుడగమనరావు, "ఆ అమ్మాయి మన తెలుగులో ఈ మధ్యే వచ్చిన 'మల్లేశ్వరి' సిన్మాలో హీరోయిన్‌గా నటించింది కదా! సిగ్గులేక పోతే సరి! బుద్ధిగా చదువుకోక ప్రేమ, పెళ్లి అంటే చంపేస్తా!" అన్నాడు.

"నా కొడుకు అందమైన పిల్లను ప్రేమించడం, పెళ్లాడ్డం మీ ఎవ్వరికీ ఇష్టం లేనట్లుంది!" అంది, మూతి మూడు వంకర్లు తిప్పి అక్కణ్నుంచివెళ్లిపోతూ, వర్ధని.

మిగిలినవారూ ఒక్కొక్కరే అక్కణ్నించి జారుకుంటున్నారు. రజని వెళ్తూ వెళ్తూ, "నాకు డిగ్రీ అయిపోయి రెండేళ్లయ్యింది. నాకు మగణ్ని తేలేక నాన్న సతమతమౌవుతున్నాడు. వీడు చదివేది సీనియర్ ఇంటర్. వీడికి అప్పుడే పెళ్లా? ఏం చూసి వీణ్ని కైఫ్ పెళ్లి చేసుకుంటుంది? ఆశపడ్డా దానిక్కూడా అర్హత వుండాలి. అయినా సిన్మా స్టార్, కట్టుకున్నవాడితో ఎప్పటి దాకా కాపురం చేస్తుందో, ఎప్పుడు విడాకులు కోరుతుందో, ఎవరు చెప్పగలరు?" అని గొణుగుతూ తనూ లోపలికి వెళ్లి పోయింది.

000

పార్కులో మురుగభూషణానికి ఇద్దరు ఫ్రెండ్స్ కలిశారు. ఆ ఇద్దరికీ చెరో సిగరెట్ ఇచ్చి, తనోటి వెలిగించాడు. సిగరెట్లు కాలుస్తూ ముగ్గురూ కబుర్లలోకి దిగారు. భూషణం థిక్కెస్టు ఫ్రెండ్ సన్నీ, "నీ ఫేవరేట్ కత్రిన, సల్మాన్ ఖన్‌ని పెళ్లాడబోతోందట, పేపర్లో న్యూస్ వచ్చింది" అన్నాడు.

సన్నీ మాట పూర్తికాగానే, మరో ఫ్రెండ్ జాకీ కలుగజేసుకుంటూ, "ఉరేయ్ సన్నీ! ఆ కత్రినాకైఫ్ వీడికి అక్కకూతురా, లేక మేనమావ కూతురా? ఏముందని వీణ్ని ఆమె ప్రేమిస్తుంది, పెళ్లాడుతుంది? ఆ సల్మాన్ ఖాన్ పెద్ద రోమియో. కైఫ్, ఐశ్వర్యారాయ్ లాంటి ఆడాళ్లతో బోలెడన్ని ఎఫైర్లు నడిపాడు. వాడు బాలీవుడ్ హీరో, అందగాడు, ఫైటర్, బాడీ బిల్డర్. అతని నెవరైనా ప్రేమిస్తారు. వీడి పర్సనాలిటీ చూస్తే మునిస్పాలిటీయేగా! మన క్లాస్ మేట్ జాహ్నవికే వీడు నచ్చలేదంటే, కైఫ్ వీణ్ని ఏం చూసి ప్రేమిస్తుందో?" అన్నాడు, సిగరెట్ పీక ఆర్పి దూరంగా విసిరేస్తూ.

భూషణం తల పంకిస్తూ, "స్వచ్ఛమైన ప్రేమకు కులమతాలు అడ్డు రావు. ప్రేమించే హక్కూ, మనిషిని ఆరాధించే హక్కూ, ప్రతి భారతపౌరుడికీ ఉంది. నేను మొన్నటి వరకూ ఐశ్వర్యారాయ్‌ని ప్రేమించా. నా బ్యాడ్ లక్, ఆమెకు అభిషేక్ బచ్చన్‌తో పెళ్లయిపోయింది. అలాగే కైఫ్ సినిమారంగప్రవేశం చేసినప్పట్నుంచీ నా కలల రాణి అయ్యింది. ఆట్టే మాటాడితే కైఫే నా ప్రాణం!" అంటూండగానే అతని గొంతు జీరబోయింది. కళ్లు సజలాలు అయ్యాయి.

జాకీ, సన్నీ, ఇద్దరూ వాడి ఏడుపుగొట్టు ముఖం చూస్తూ జాలిగా "సారీరా! నీలాగే సినిమా హీరోయిన్‌ల పిచ్చి మాకూ ఉందనుకో! అలాగని మనకు నచ్చిన అమ్మాయినల్లా ప్రేమించి పెళ్లాడగలమా? వాళ్లు మనలాంటి వాళ్లే. జేబులో చిల్లర, మన బ్యాంక్ బాలెన్స్ చూసి వాళ్లు ప్రేమించాలే గాని, నీలాంటి గుమాస్తా కొడుకుని తెలిసి తెలిసి ఎవరు ప్రేమిస్తారు? ఒక వేళ పొరపాటున నువ్వు అటువంటామెను పెళ్లాడితే, నీ సంపాదన ఆమె మేకప్ సామానుకే చాలదు!" అన్నారు.

మిత్రులు తన సిగరెట్లు కాల్చి, తనకి ప్రతికూలంగా మాట్లాడినందుకు మురుగభూషణం బాగా హర్ట్ అయ్యాడు.

కనుచీకటి పడేవరకూ అక్కడా, అక్కడా గడిపి, భూషణం ఇంక ఇది పద్ధతి కాదనుకుని, తనకు అందరి సపోర్టూ కావాలనుకున్నాడు. అందులో భాగంగా ఒక మార్గాన్ని ఎంచుకున్నాడు. ఊరి మధ్యే వున్న ఎత్తయిన రక్షిత మంచినీళ్ల ట్యాంక్ మీదికి ఎక్కాడు.

ముందు జనం చూసి, సరదాపడి అక్కడికి ఎక్కుతున్నాడనుకున్నారు. తర్వాత కేకలు పెట్టి అడిగితే, "నేను కోరిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి, నా తల్లిదండ్రులకు సహకరించాల్సిందిగా చెప్పండి!" అనే ప్లే కార్డు మెళ్లో వేసుకున్నాడు. వాటర్ ట్యాంక్‌పై లైటు అతగాణ్ని ఫలానా అని పోల్చుకునేలా సహకరిస్తోంది.

కర్ణాకర్ణి గా కొడుకు ఆత్మహత్యాప్రయత్నం ఎలాగైతేనేం, గరుడగమనరావు చెవిన పడింది. అదీ తాను ప్రేమించిన స్టార్ కోసమే నన్న వైనం విని, పరిగెట్టుకొచ్చాడు. వగరుస్తూ రావడమే తడవుగా, "ఏరా భూషణం! నీకేం మాయరోగం వచ్చిందని ఆ ట్యాంకు పైకెక్కి చావాలనుకుంటున్నావు? నీకు పిచ్చి కుదిరిందనుకున్నాను. నాకు వున్న వంశోద్ధారకుడివి నువ్వే. రేపు నాకూ, మీ అమ్మకూ తలకొరివి పెట్టేదీ నువ్వే. నువ్వు నీళ్ల ట్యాంక్ మీద నుండి దూకి చావబోతున్నావని ఎవరో చెప్పగానే, మీ అమ్మ ఫెయింటై పడిపోయింది. దాన్ని ఆసుపత్రిలో జేరిపించి, నేనిలా నీ కోసం చక్కా వచ్చాను. ఇంతట్లో ఏమయ్యిందని ఇటువంటి కఠోరనిర్ణయం తీసుకున్నావు?" అన్నాడు.

"నా ఫ్రెండ్స్ సన్నీ, జాకీ కూడా నన్ను నా కోరిక తీరనిదని అవమానిస్తూ మాట్లాడారు. నా హాట్ లవ్ మీద, చల్లని నీళ్లు జల్లేశారు. అందుకు వాళ్లిద్దరూ నాకు క్షమాపణలు చెప్పి తీరాలి. అప్పటి దాకా నేనీ వాటర్ ట్యాంక్ మీద నుండి దిగేదే లేదు. కిందికి దూకేస్తా!" అని అరుస్తూ యాక్షన్ చేస్తూ బెదిరించాడు మురుగభూషణం.

"ఏం గ్రహచారమొచ్చిందిరా భగవంతుడా?" అని అక్కణ్నుంచి చీకట్లో గరుడగమనరావు, మరో ఇద్దర్ని తీసుకుని, ఇరుకు రోడ్డు మీద పడి నడకసాగించాడు. ఎలాగైతేనేం, ఇంటి దగ్గర సన్నీ దొరి

కాదు. వాకీ కల్లు ఊరికి దూరంగా, విసిరేసినట్లు వుంది. పడుతూ లేస్తూ అక్కడికే వెళ్లాడు. బతిమాలి ట్యాంక్ దగ్గరకి వాళ్లని తీసుకొచ్చాడు.

వాళ్లిద్దరూ కూడబలుకున్నట్టు ముందు రామన్నారు. "అలా కాదు, మీరిద్దరూ, 'మేం అన్నమాటలు బుద్ధి తక్కువై వాగాం! మా తప్పు మేం తెలుసుకుని లెంపలేసుకుంటున్నాం' అని చెప్పండి" అన్నాడు.

ఆ గడుగ్గాయిలిద్దరూ, "అలా మేమెందుకు చెప్పాలి?" అంటూ మొండికేశారు.

చెరో వంద రూపాయలు చేతిలో పెట్టాడు గరుడగమనం. "ఇది నా కొడుక్కి జీవన్మరణసమస్య. నేను చెప్పినట్లు చెప్పి, నాకు పుత్ర భిక్ష పెట్టండి" అన్నాడు.

అతని కూడా వచ్చిన ఇద్దరూ ఊరుకోకుండా, చెప్పకపోతే తంతామన్నారు.

సరే లెమ్మని వాళ్లిద్దరూ ట్యాంక్ దగ్గరకొచ్చి గరుడగమనరావు చెప్పమన్నట్టు చెప్పగానే, మురుగభూషణం ఉత్సాహంగా దిగి కిందికి చక్కా వచ్చేశాడు.

అప్పటికే చాలామంది జనం పోగుపడి రకరకాల కామెంట్లు మొదలెట్టారు.

000

ఇంటికొచ్చాడన్న మాటే గాని, "ఆ పిల్ల ముస్లిం స్త్రీకి పుట్టింది. సల్మాన్‌ఖాన్ ముస్లిం, వాళ్లిద్దరూ పెళ్లి చేసుకోవడానికి ఏ ఇబ్బందీ లేదు. పైగా ఆమె నీ కన్నా వయసులో పెద్దది. ఫిల్మ్ స్టార్. మీ ఇద్దరికీ, నక్కకీ, నాకలోకానికీ వున్నంత తేడా వుంది. నీకేమో తెలుగు తప్ప నాలుగు ఇంగ్లీషు ముక్కలు గాని, పది హిందీ ముక్కలు గానీ రావు. సినిమాల్లో, యాడ్స్, యాంకరింగులు చేసేది నీతో కాపురమేం చేస్తుంది గనుక?" అంది తల్లి వర్ధని.

వెంటనే "నేను నీ మాట గాని, అమ్మ మాట గాని వినను గాక వినను! ప్రేమకు ఎల్లలు లేవు. భాషాభేదాలు అడ్డు రావు. మతం అంత కన్నా పట్టింపు కాదు. రాకెట్ వేగంతో మనం 21వ శతాబ్దంలోకి ప్రయాణిస్తున్నాం. ఇంకా ఈ పట్టింపులూ, అన్నీ, వట్టి ట్రాష్! నాకు వాటి మీద నమ్మకం లేదు" అన్నాడు.

అనుకోకుండా ఆ ఊళ్లో సల్మాన్‌ఖాన్ నటించిన చిత్రం సెకండ్ రిలీజ్ అయినట్లు, అతని క్లాస్ మేట్ వచ్చి చెప్పాడు. దొరికింది అవకాశం అనుకుని, నలుగురు ఆకతాయి గ్యాంగ్‌ను డబ్బిచ్చి పోగుజేశాడు. వాళ్లతో కలిసి అతని పోస్టర్లెక్కడెక్కడ అతికించారో, అక్కడల్లా పేడ ముద్దలు కొట్టించాడు.

తెల్లవారేసరికల్లా ఈ నిర్వాకం ఎవరిదంటే ఎవరిదని, ఆ హాలు యాజమాన్యం కంగారు పడింది. నిఘా వేసి కూపీ లాగితే నలుగురు కాలేజీ కుర్రాళ్లు ఈ పని చేసినట్లు నోటీసులో కొచ్చింది. స్టూడెంట్స్‌తో ఎందుకొచ్చిన గొడవని యాజమాన్యం స్పందించ లేదు. పైగా హిందీ చిత్రాలకు స్టూడెంట్స్ మహారాజపోషకులని సర్దిచెప్పుకున్నారు.

మరునాడు ఆ హాలు ముందున్న బస్టు సైజు సల్మాన్‌ఖాన్ కటౌట్ రాత్రికి రాత్రి మాయమైంది. ఎస్.ఐ. సెక్యూరిటీ కోసం ఆరు గుళ్ల పిస్తోలును ఇంట్లో డ్రాయర్ సొరుగులో దాస్తే, దాన్ని ఒక చైన్ స్నాకర్ చేత మురుగభూషణం దొంగిలింపించాడు. అందుకు వాడికి భారీ మొత్తం ముట్టజెప్పాడు.

మిత్రులు, "ఇటువంటి పనులు చట్టరీత్యా నేరం!" అని హెచ్చరించినా వినకుండా, ఆ కటౌట్‌ని ఓ మారుమూల పెట్టించి, నాలుగు బుల్లెట్లు పేల్చి సల్మాన్ బొమ్మ చెస్ట్ మీదా, మరొటి తల మీదా, ఇంకో రెండు ఒకటి చెవి మీదా, మరోటి ముక్కు మీదా పేల్చాడు. నాలుగు రౌండ్ల కాల్పులకు కటౌట్ మీద కన్నాలు పడ్డాయి. జనం పోగవుతుండగా మిత్రులతో పరారైపోయాడు, మన రోమియో.

ఫార్మాలిటీ కోసం హాలు యాజమాన్యం, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు రిజిస్టర్ చేసింది.

దొంగిలించి తెచ్చినంత వేగంగా ఆ చైన్ స్నాకర్ చేత రివాల్వర్‌ని అతని ఇంటి దగ్గరే తెల్లారేటప్పటికి పెట్టించాడు భూషణం.

మరునాడు ఎస్.ఐ. స్టేషన్‌కొచ్చి డ్యూటీ చేస్తూ, బెల్ట్ కవర్ తీసి పిస్టల్ చూస్తే, అందులో మిగిలిన ఐదు గుళ్లలో నాలుగు ఖర్చయ్యాయి. మిగిలింది ఒకే ఒక్కటి. పై ఆఫీసర్ వచ్చి వాటి గురించి ఆరా తీస్తే ఏం చెప్పాలా అంటూ, జుట్టు పీకున్నాడు ఎస్.ఐ.

మురుగభూషణం చేసినవన్నీ చేసేసి ఇంటికొచ్చి, ముసుగు తన్ని పడుకున్నాడు.

గతంలో ఒకసారి కొడుకుని విశాఖపట్నం పిచ్చాసుపత్రికి తీసుకెళ్లి వాడి మానసికస్థితి చెక్ చేయించాడు. అప్పుడే అతగాడికి చిత్త చాంచల్యం ఉన్నట్టు డాక్టర్ సర్టిఫికెట్ ఇస్తే, వైద్యం చేస్తున్నట్లు మరో సర్టిఫికెట్, ఎందుకైనా మంచిదని గరుడగమనరావు తీసుకోవడం జరిగింది. అప్పుడు మురుగుడు ఐశ్వర్య పిచ్చిలో ఉండేవాడు. లక్కీగా భూషణం మానసికస్థితి సరిగా లేదని సివిల్ సర్జన్ సర్టిపై చేసి స్టాంపు వేసి ఇచ్చాడు.

ఎలాగైతే బ్రహ్మప్రయత్నం చేసి పోలీసులు ఆ రివాల్వర్ దొంగిలించుకెళ్లిన చైన్ స్నాకర్‌ని, వాల్ పోస్టర్లపై పేడ వేసిన నలుగుర్నీ



పట్టి, భూషణం ఇంటికి తీసుకొచ్చారు.

గరుడగమనరావు రక్షకభటుల్ని చూసి ఖంగుతిన్నా, వెంటనే కొడుకు తాలూకు, తాను లోగడ రాయించి పెట్టుకున్న విశాఖపట్నం సివిల్ సర్జన్ ఇచ్చిన సర్టిఫికెట్ చూపించాడు.

పోలీసులు, "మా ఎస్.ఐ. గారి రివాల్వర్‌లో నాలుగు గుళ్లుం డాలి. అవి మీ అబ్బాయి సల్మాన్‌ఖాన్ కటౌట్‌పై గురిపెట్టి కాల్చాడని వీళ్లు చెబుతున్నారు. ఆయన పై ఆఫీసర్‌తో సంజాయిషీ చెప్పుకోవాలిగా? అందుకు మిమ్మల్నీ, మీ అబ్బాయినీ ఇక్కడున్నట్లు తీసుకురమ్మన్నారు. అంతగా కావాలంటే మీ అబ్బాయి పక్క వకాల్తా తీసుకుని అతని మానసికస్థితి బాగుండలేనట్లు మేమూ నచ్చజెపుతాం" అన్నారు.

అనిష్టంగానే గరుడగమనరావు, కొడుకును తీసుకుని పోలీసు వాహనంపై స్టేషన్‌కి బయల్దేరాడు.

కత్రినాకైఫ్‌కీ, సల్లూకీ పెళ్లి కాలేదు కాని, భూషణానికీ, అతనికి సహకరించిన మిత్రబృందానికీ, ఎస్.ఐ. స్టేషన్‌లో లాఠీల పెళ్లి చేసి సత్కరించాడు. ●